


# కరవత్రం

SINCE 2014

గురువారం జూన్ 18, 2026 | సంపుటి : 2 | సంచిక : 246 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



## మట్టిలో మాణిక్యాల

# వేట

ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ కాదు

ఆ భావన నుంచి అంతా బయటపడితే మంచిది

- ఇక్కడే మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం
- సర్కార్ బడుల నుంచే ఐఎఎస్,ఐపిఎస్‌లు వచ్చారు
- అందరికీ విద్య లక్ష్యంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు
- కులమాతలకు అతీతంగా విద్య అందించాలన్న లక్ష్యం
- ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్
- స్కూల్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి



**రంగారెడ్డి,జూన్17**

ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరమని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ బడుల్లో చదివి ఐఏఎస్, ఐపీఎస్, సీఎంలు అయినవాళ్లు ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ అనే ఆలోచన పోవాలని అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. స్కూల్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీ, ల్యాబ్స్, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నారు. ఆహ్లాదకరంగా ఏర్పాటు చేసిన మైదానంలో సరదాగా విద్యార్థులతో ఫుట్‌బాల్ ఆడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు.

మిగతాది 2 లో



## రాష్ట్రంలో సంక్షేమం లేదు..

# అంతా సంక్షోభమే

### దండుపాళ్యం బ్యాచ్ రాష్ట్రాన్ని దోచుకుంటోంది

- జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా అభివృద్ధి సున్నా
- ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కెసిఆర్ మళ్లీ సిఎం
- సర్‌పై కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాల్సిందే
- పాలేరు నియోజకవరగ్గ బూత్ కార్యకర్తల భేటీలో కెటిఆర్



**ఖమ్మం,జూన్17 :**

రాష్ట్రంలో సంక్షేమం లేదని.. ఎక్కడ చూసినా కూల్చివేతలే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణలో రాక్షస పాలన సాగుతోందని ఆయన విమర్శించారు. దండుపాళ్యం ముఠాకు అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అయితే ఇక్కడ మంత్రులు ఆయనను మించిపోయారంటూ దుయ్యబట్టారు. రెవెన్యూ మంత్రి అవినీతికి హద్దు లేకుండా పోయిందని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించారు. పాలేరు నియోజకవర్గం వెంకటగిరిలో బూత్‌లెవల్ కార్యకర్తల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించారని అన్నారు. కేసీఆర్ మళ్లీ రావాలని తెలంగాణ ప్రజలు కోరుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తిరిగి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

2లో..

# రెండోవిడతలో గుడిసువాసులకు ప్రాధాన్యం

» 75 వేల గుడిసెవాసుల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన

» గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్,జూన్17 :**

ఇందిరమ్మ ఇళ్లు రెండో విడతలో గుడిసె వాసులకే తొలి ప్రాధాన్యం ఇస్తామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లపై గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల గుర్తింపునకు ప్రత్యేక సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 75 వేల గుడిసెవాసుల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామన్నారు.

2లో..

## 2వేల కోట్ల బడ్జెట్ లేకుండా

# అంత స్కామ్ సాధ్యమా

### హరీష్ వ్యాఖ్యలపై పొన్నం ఆగ్రహం



**హైదరాబాద్,జూన్17 :**

తెలంగాణ గురుకుల పాఠశాలల టెండర్లలో రూ.2,000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

మిగతాది 2లో



# సర్‌తో ముస్లిం ఓట్ల తొలగింపు కుట్ర

» బెంగాల్, బాహార్‌లే ఇందుకు నిదర్శనం

» మీడియాతో మంత్రి అజారుద్దీన్ వ్యాఖ్య

**హైదరాబాద్,జూన్17 :**

'సర్' ప్రక్రియతో ముస్లింల ఓట్లను తొలగించే అవకాశముందని తెలంగాణ మంత్రి అజారుద్దీన్ షాకింగ్ కామెంట్స్ చేశారు. 'సర్' అందరి అంశమైనా.. ముస్లింల ఓట్లనే టార్గెట్ చేస్తారని ఆరోపించారు. పశ్చిమబెంగాల్, బిహార్‌లో ముస్లింల ఓట్లు తొలగించి బీజేపీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు.

2లో..

# నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు శుభవార్త

» రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా బస్సు ప్రయాణం

» రవాణామంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



**కరీంనగర్,జూన్17 :**

ఈనెల 21న నిర్వహించే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్ చూపించి ఎక్కడికైనా ప్రయాణం చేయవచ్చన్నారు. రవాణా కోసం విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. బుధవారం మంత్రులు లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్ మానకొండూరు మండలం తిమ్మాపూర్ నుంచి కరీంనగర్ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీలో ఉద్యోగాల సంఖ్య పెంచామని, ఆర్టీసీ కార్మికులకు అన్ని వసతులు కల్పించే విధంగా కృషి చేస్తున్నామని మంత్రి పొన్నం వివరించారు. ఆర్థికంగా మహిళలను బలోపేతం చేసేందుకు ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశామని గుర్తు చేశారు. ఆర్టీసీలో మరిన్ని సేవలను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈనెల 21న జరిగే నీట్ పరీక్షలకు ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు.



# టెలిగ్రామ్ యాప్ నిషేధం బుర్రతక్కువ పని

» కేంద్రం తీరుపై మండిపడ్డ రాహుల్, కేజ్రీవాల్

**న్యూఢిల్లీ,జూన్17 :**

నీట్-యూజీ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్ యాప్‌ను తాత్కాలికంగా నిషేధించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వివాదాన్ని రేకెత్తించింది. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సహా ప్రతిపక్ష నాయకులు ఈ చర్యను తీవ్రంగా విమర్శించారు. 'ఈ చర్య నిజంగా పేపర్ లీక్‌లను నిరోధిస్తుందా' అని వారు సందేహాలు వ్యక్తం చేశారు.

2 లో

## వరంగల్ పర్యటనలో

# పవన్ కళ్యాణ్

- అభిమాని చిన్నారి నిరంజన్‌కు పరామర్శ
- వైద్యం కోసం లక్ష రూపాయాల ఆర్థికసాయం
- భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు





**వరంగల్,జూన్17 :**

ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్ (17)ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించారు. బుధవారం హనుమకొండ, హనుమాన్ నగర్‌లోని బాలుడి ఇంటికి వెళ్లారు. బాలుడితో కొద్దిసేపు ముచ్చటించారు. నిరంజన్ కుటుంబానికి పవన్ భరోసా ఇచ్చారు. నిరంజన్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష ఆర్థిక సాయం అందించారు. చిన్ననాటి నుంచి మీరంటే ప్రాణం అని చెప్పిన నిరంజన్ మాటలకు పవన్ చలించి పోయారు. నిరంజన్‌ను హత్తుకుని ముద్దాడారు. తను ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్ పాటలకు వేసిన డాన్స్‌ల వీడియోలను నిరంజన్.. పవన్‌కు చూపించారు. తిరుమల నుంచి తెప్పించిన వస్త్రాన్ని నిరంజన్‌కు అందించారు. భద్రకాళి ఆలయంలో పూజ చేయించిన అమ్మవారి వెండి ప్రతిమను నిరంజన్ తల్లిదండ్రులకు అందజేశారు.



# సైబర్ నేరస్థులు పరాన్న జీవులు

» ప్రజలను మోసగించే వారు సమాజానికి చేటు

» అలాంటివారు జైల్లో ఉండడమే కరెక్ట్

సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,జూన్17 :**

సైబర్ నేరస్థులు అమాయక ప్రజలను మోసంచేసి కోట్లాది రూపాయలు కాజేసే పరాన్నజీవులని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం జూన్ 18, 2026

# మట్టిలో మాణిక్యాల వేట

మొదటి పేజీ తరువాయి
కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ స్కూల్‌ను సర్కార్ నిర్మించింది. స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. ఆరుట్ల పాఠశాలను పైలట్ ప్రాజెక్టుగా నిర్మించామని తెలిపారు. విద్యాశాఖపై ప్రభుత్వం రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై తల్లిదండ్రులకు అపోహలు ఉన్నాయని.. అందరి అపోహలు తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యా కమిషన్ వేశామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్య మాత్రమే మన జీవితాలను సమూలంగా మార్చగలదన్నారు. విద్య ఖర్చు కాదని.. పెట్టుబడి అని చెప్పుకొచ్చారు. విద్యతో సమాజంలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం వర్గానికొక స్కూల్ పెట్టి కుల వ్యవస్థను ప్రోత్సహించిందని సీఎం విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ కులానికొక స్కూల్ పెట్టారన్నారు. కుల వ్యవస్థను నిర్మూలించేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. మెస్సీని హైదరాబాద్‌కు తీసుకువస్తే విమర్శలు చేశారని.. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే మెస్సీని తీసుకువచ్చామని తెలిపారు. మెస్సీ.. డ్రగ్స్ ముఠా లీడర్ కాదని, ఆర్థిక నేరగాడు కాదన్నారు. గత ప్రభుత్వం యూనిఫామ్‌లు ఇస్తే.. నెల రోజులకే చిరిగి పోయాయని విమర్శిస్తూ.. ఈ ప్రభుత్వం నాణ్యమైన వస్తువులతో విద్యా కిట్ ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్ఫూర్తినిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరం అన్నారు. త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తాం. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకు మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొస్తే విమర్శలు చేశారు. విద్యాకిట్ల పంపిణీ కోసం రూ.680 కోట్లతో టెండర్లు పిలిచాం. రూ.680 కోట్ల టెండర్లలో రూ.2వేల కోట్ల స్కామ్ జరిగిందని ఒకాయన అంటున్నారు.. ఎలా సాధ్యమో చెప్పాలి. విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం' అని సీఎం అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్విద్యా రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.



ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ విద్యా నమూనా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 25 లక్షల మంది విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యాశాఖ కోసం రూ.8,500 కోట్లను కేటాయించిందని ఆయన వెల్లడించారు. విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ఉద్యోగాలు రావన్న అపోహలు పేద ప్రజల్లో ఉన్నాయని, ఆ నమ్మకాన్ని తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేశామని సీఎం వివరించారు. విద్యా కమిషన్ వివిధ జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలను సందర్శించి రూపొందించిన నివేదిక ఆధారంగానే ఈ కొత్త విద్యా విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన 'దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉంది' అనే భావనను స్ఫూర్తిగా తీసుకుని విద్యా రంగంలో మార్పులు తీసుకొస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్య ద్వారానే సమాజంలో సమూల మార్పు సాధ్యమవుతుందని, అందుకే విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ఆరుట్ల టీపీఎస్‌లో ఇప్పటికే 1,814 మంది విద్యార్థులు చేరారని సీఎం తెలిపారు. భారీగా దరఖాస్తులు రావడంతో అడ్మిషన్లు లేవని బోర్డు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఈ విజయానికి అక్కడి ఉపాధ్యాయుల కృషే కారణమని, వారు రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. తాను కూడా గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని సీఎం గుర్తు చేసుకున్నారు. ఆరో తరగతి చదవడానికి రోజూ ఆరు కిలోమీటర్లు నడిచి వెళ్లేవాడినని చెప్పారు. తమ కుటుంబం ఆర్థికంగా బాగానే ఉన్నప్పటికీ చదువుకున్నవారు లేరని, 17 ఏళ్ల వయస్సులోనే రాజకీయాల్లోకి వచ్చానని వివరించారు. దేశ ప్రధానులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు సహా ఎన్నో ప్రముఖులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని ఆయన పేర్కొన్నారు. సమాజంలో కులాల మధ్య గోడలు నిర్మిస్తున్నారని, ఆ గోడలను కూల్చాలనే ఉద్దేశంతో అన్ని వర్గాల పిల్లలు కలిసి చదివేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నామని సీఎం తెలిపారు. విద్య ద్వారా సమానత్వాన్ని పెంపొందించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. 140 కోట్ల జనాభా ఉన్న దేశం ఒలింపిక్స్‌లో ఆశించిన స్థాయిలో పతకాలు సాధించలేకపోతోందని అన్నారు. ఇటీవల దక్షిణ కొరియాను సందర్శించి అక్కడి క్రీడా విధానాలను అధ్యయనం చేశానని చెప్పారు. 2034 నాటికి తెలంగాణ నుంచి ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించే క్రీడాకారులను తయారుచేయాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రాజకీయ స్వార్థంతో కొందరు అభివృద్ధి కార్యక్రమాలను కూడా వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన స్కూల్ కిట్లు అందించేందుకు పారదర్శకంగా టెండర్లు నిర్వహించినప్పటికీ.. కొందరు అవినీతి ఆరోపణలు చేస్తున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. ఉన్నత విద్యావంతులు కూడా వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం బాధాకరమని అన్నారు.
రాష్ట్ర యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. ఈ నెల 19న హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో గవర్నర్ సమక్షంలో డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 2వేల కోట్ల బడ్జెట్ లేకుండా అంత స్కామ్ సాధ్యమా

మొదటి పేజీ తరువాయి
ఈ వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఘాటుగా స్పందించారు. సంక్షేమ శాఖల్లో మొత్తం టెండర్ల విలువే రూ.2 వేల కోట్లు లేనప్పుడు, అంత మొత్తంలో స్కాం జరిగిందని ఎలా అంటారుని మంత్రి పొన్నం ప్రశ్నించారు. ఆధారాలు లేకుండా బలహీన వర్గాల అభివృద్ధి కోసం పనిచేస్తున్న శాఖలపై విమర్శలు చేయడం సరికాదన్నారు. హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమని, వాటిని నిరూపిస్తే ప్రభుత్వం దేనికైనా సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. రాజకీయ లబ్ది కోసం నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. బలహీన వర్గాల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, అలాంటి వర్గాలను మాటలతో కించపరచే ప్రయత్నాలు చేయొద్దని హితవు పలికారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఆరోపణలు చేస్తే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించే లక్ష్యంతోనే సర్ పక్రియను తీసుకొచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు.

## సైబర్ నేరస్థులు పరాన్న జీవులు

మొదటి పేజీ తరువాయి
ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న వారిపై చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. ఈ మేరకు ఓ సైబర్ ఫ్రాడ్ కేసులో నిందితుడికి బెయిల్ నిరాకరించి, ఆ పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది న్యాయస్థానం. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా.. సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సైబర్ నేరాలపై పెరుగుతున్న ముప్పుపై ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలను ఆకర్షించి భారీ లాభాలొస్తాయని నమ్మబలికి వారిని మోసగించే వ్యక్తులు సమాజానికి ప్రమాదకరమంది. 'మీరు పరాన్నజీవులు.. పెట్టుబడిదారుల నుంచి డబ్బు తీసుకుని మోసం చేస్తున్నారు. మీలాంటి వారు జైల్లో ఉండటమే సమాజానికి శ్రేయస్కరం. సైబర్ నేరస్థుల విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలి. ఇలాంటి నేరాలు ఎప్పుడూ పాన్ ఇండియా స్థాయిలో జరుగుతూ ఉంటాయి. గుజరాత్‌లో ఒకరు, ఆ తర్వాత ముంబై మరొకరి నుంచి.. ఇలా అందరి నుంచి డబ్బులు వసూలు చేస్తారు' అని ధర్మాసనం పేర్కొంది. సందర్భంగా కోర్టుకు అందించిన వివరాలను ప్రస్తావిస్తూ.. గతేడాది చివరి నాటికి దేశంలో డిజిటల్ మోసాల కారణంగా రూ.3 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు పేర్కొంది న్యాయస్థానం. సైబర్ నేరాల తీవ్రతను ఇది విస్పష్టంగా తెలియజేస్తోందని వ్యాఖ్యానించింది. కాగా.. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) గణాంకాల ప్రకారం.. 2021 నుంచి 2023 మధ్య సుమారు 63 శాతం సైబర్ మోసాలు పెరగడంతో కేసుల సంఖ్య 86 వేల మార్కును దాటింది. వీటిలో కర్ణాటక తొలి స్థానంలో ఉండగా.. తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

## టెలిగ్రామ్ యాప్ నిషేధం బుర్రతక్కువ పని

మొదటి పేజీ తరువాయి
పరీక్షా పేపర్ లీక్‌లను అరికట్టడంలో విఫలమైన ప్రభుత్వం విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటోందని ఆరోపించారు 'పేపర్ లీక్ మాఫియాపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, టెలిగ్రామ్‌ను నిషేధించారు. ఇది సమస్యకు పరిష్కారం కాదు. దొంగలను పట్టుకోలేక, బాధితుల తలుపులకు తాళం వేస్తున్నారు. లక్షలాది మంది విద్యార్థులు ఏళ్లుగా టెలిగ్రామ్‌ను ఉపయోగించుకుని నోట్స్, టెస్ట్ సిరీస్‌లు, డిస్కషన్‌లతో చదువుకుంటున్నారు. ఆ సౌకర్యాన్ని లాక్కోవడం పేపర్ లీక్‌లకు పరిష్కారం ఎలా అవుతుంది' అని సోషల్ మీడియా ద్వారా రాహుల్ విమర్శించారు. అరవింద్ కేజ్రీవాల్ కూడా ఈ అంశంపై స్పందించారు. 'ఈ రోజు టెలిగ్రామ్‌ను నిషేధించారు. రేపు వాట్సాప్‌ను కూడా నిషేధిస్తారా?' అంటూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశ్నించారు. మరోవైపు ఈ నిషేధాన్ని సవాలు చేస్తూ టెలిగ్రామ్, ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు పావెల్ దురోవ్ కూడా ఈ చర్యపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఇది 15 కోట్లకు పైగా భారతీయ వినియోగదారులను శిక్షించడమే. ఈ చర్య అసలు లీక్‌లను ఆపదు' అని వ్యాఖ్యానించారు.

## రెండోవిడతలో గుడిసువాసులకు ప్రాధాన్యం

మొదటి పేజీ తరువాయి
అర్హుల ఎంపిక పూర్తి పారదర్శకతతో చేపడతామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేయని గుడిసె వాసులకు మరో అవకాశం ఇస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. రెండో విడతలో 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామని వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 2 వేల ఇళ్లు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు నిర్మిస్తామని.. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా 50 వేల కుటుంబాలకు లబ్ది చేకూరుతుందని పేర్కొన్నారు.ప్రమాదకర ఇంటి పైకప్పుల మార్పునకు రూ. 2 లక్షల వరకు సాయం అందిస్తామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. అసంపూర్తిగా వదిలిన ఇళ్లను కూడా ఈ పథకంలో ప్రభుత్వం చేర్చనుందన్నారు. లబ్దిదారుడే ఇంటి నిర్మాణదారడని తెలిపారు. బీఎల్‌సీ విధానంలో నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు. పట్టణాల్లో అవసరమైతే జీ ప్లస్ 1 నిర్మాణాలకు అనుమతి ఇస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి వివరించారు.

## రాష్ట్రంలో సంక్షేమం లేదు..అంతా సంక్షోభమే

మొదటి పేజీ తరువాయి
వ్యవసాయం సంక్షోభంలోకి పోతే పట్టించుకున్న దిక్కు లేదని కేటీఆర్ విమర్శించారు. ఆర్థిక మంత్రి కమీషన్లకు అక్రమాలకు అంతం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని.. వారికి కనీసం యూరియా ఇచ్చే పరిస్థితి లేదని మాజీ మంత్రి అన్నారు. కేసీఆర్ చేసిన అప్పు..కాళేశ్వరం, భక్తరామదాసు, తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసమని స్పష్టం చేశారు. పేద విద్యార్థుల కోసం మెడికల్ కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. బూత్‌ల వారీగా బలమైన కార్యకర్తల నిర్మాణం జరగాలని కేటీఆర్ అన్నారు. సర్ అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అని.. దేశంలో ఇప్పటికి 13 సార్లు జరిగిందని.. ఇప్పుడు 14వ సారి అని తెలిపారు. సర్‌ను పట్టించుకోక పోతే నష్టం తప్పదన్నారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల25 వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి బూత్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రతి ఒక్క అంశాన్ని ప్రస్తావించాలని సూచించారు. ఇది చాలా కీలకమైన సమయమని, ఒక్క ఓటు కూడా పోకుండా చూసుకోవాలన్నారు. 'నిజాయతీగా ఎన్నికలు జరిగితే కేసీఆర్ ఈరోజు 100 సీట్లతో గెలుస్తారు.. నిజాయతీగా గెలవాలంటే మనం జాగ్రత్తగా ఉండాలి' అంటూ కార్యకర్తలకు కేటీఆర్ సూచించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా జిల్లా ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. దాచుకోవడం దోచుకోవడం తప్ప జిల్లా అభివృద్ధికి వారు పాటుపడిందేమి లేదని స్వార్థ ప్రయోజనాల కోసమే పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఒక మంత్రి భూముల కబ్జాలకు పాల్పడుతుంటే, మరో మంత్రి వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారన్నారు. ఇక ఆర్థిక మంత్రి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. ప్రతిరోజు కేసీఆర్ అప్పులు చేశాడని మొరుగుతున్న నాయకులు ఎందుకు చేశారో బదులిచ్చారు. కేసీఆర్ చేసిన అప్పులకు రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి సజీవ సాక్షాలుగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో లక్షల కోట్లు అప్పుచేసి ఏమి అభివృద్ధి చేసిందో రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి ఆలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ దందాలకు పాల్పడుతూ అనేక అక్రమాలకు ఊతమిస్తున్నారన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో దృశ్యాలను సభా వేదికపై ప్రదర్శించారు. మరికొద్ది రోజుల్లో ఎస్ ఐ ఆర్ పక్రియ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో ప్రతి బిఎల్‌ఎ అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్హత గల వ్యక్తుల ఓటర్లు తొలగించకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో దిశా నిర్దేశర చేశారు. డిజిటల్ సభ్యత్వ నమోదులో యువత క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనకు వచ్చిన యువ నేత కేటీఆర్ కు అటు హెల్ప్ వద్ద ఇటు సభా ప్రాంగణం వద్ద కార్యకర్తలు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తక్కలపల్లి రవీందర్రావు, తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చ నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు లింగాల కమల్ రాజ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, దిండిగాల రాజేందర్, మరికంటి ధనలక్ష్మి, పాలేరు నియోజకవర్గ నాలుగు మండలాల పార్టీ మాజీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, భాషపోయిన వీరన్న, పున్నం బ్రహ్మయ్య, వేముల వీరయ్య పాల్గొన్నారు

# వరంగల్ పర్యటనలో పవన్ కళ్యాణ్


మొదటి పేజీ తరువాయి
ఇక, పవన్ పర్యటన నేపథ్యంలో అభిమానులు పెద్ద సంఖ్యలో బాలుడి ఇంటి దగ్గరికి చేరుకున్నారు. కాగా, నిరంజన్‌కు చిన్నప్పటి నుంచి పవన్ అంటే ప్రత్యేక అభిమానం. ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న అతడు తన అభిమాన హీరో పవన్ కల్యాణ్‌ను కలవాలన్న కోరికను కుటుంబసభ్యులతో వెలిబుచ్చాడు. ఈ విషయం పవన్ వరకు వెళ్లింది. ఆయన తన అభిమాని కోసం హనుమకొండకు వచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన అభిమానిని కలిశారు. అతడికి చెప్పలేనంత సంతోషాన్ని అందించారు. జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్ అనే బాలుడు తనకు అభిమాని అని, తనను కలవాలన్న అతడి ఆకాంక్షను తెలుసుకున్న పవన్.. ఉదయం నేరుగా బాలుడి నివాసానికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. తన పర్యటనకు సంబంధించిన ఫొటోలతో 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. కొద్ది రోజుల క్రితం వరంగల్ జిల్లా హనుమకొండకు చెందిన నిరంజన్ అనే యువకుడు అరుదైన వ్యాధితో పోరాడుతూ నన్ను కలవాలనే ఆకాంక్షను వ్యక్తం చేసిన వీడియోను చూశాను. నిరంజన్ ఆకాంక్షను నెరవేర్చాలని భావించాను. ఈరోజు హనుమకొండలోని అతని నివాసానికి వెళ్లి పరామర్శించాను. అరుదైన వ్యాధితో చేస్తున్న పోరాటంలో అతడి అసాధారణ ధైర్యం, ఆత్మవిశ్వాసం, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న తీరు స్ఫూర్తిదాయకం. తీవ్రమైన అనారోగ్య సమస్యల మధ్య నిరంజన్ చూపుతున్న మనోధైర్యం ప్రశంసనీయం. నిరంజన్ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని ప్రార్థించాను. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు అతనిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను. భగవంతుని ఆశీస్సులతో నిరంజన్ త్వరగా కోలుకోవాలి. ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది. త్వరలో నిన్ను సంపూర్ణ ఆరోగ్యంతో, చిరునవ్వుతో, మరింత ఉత్సాహంగా చూడాలని కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు. అదే సమయంలో వరంగల్, హనుమకొండ పర్యటనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖకు కృతజ్ఞతలు. తెలంగాణ ప్రజలు నాపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయత, అభిమానానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదాలు, ప్రేమ నాకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయి. నాపై మీ మమకారాన్ని జీవితాంతం నా హృదయాంతరాల్లో నిలుపుకొంటాను' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్ ఓ కుక్క పిల్ల బొమ్మ చూపించి దాన్ని పెంచుకోవాలని ఉందని చెప్పగా, కొని పంపుతానని పవన్ హామీ ఇచ్చారు. కుక్కను
పెంచుకోవడానికి ఇంటి ఓనర్స్ అనుమతి కావాలని నిరంజన్ తండ్రి చెప్పగా, స్వయంగా ఆ ఇంటి ఓనర్స్‌ని పిలిపించి మాట్లాడారు. నిరంజన్ తల్లిదండ్రులు వృత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటిన్‌లో పని చేసేవాళ్లమని చెప్పగా, వారి జీవనోపాధి మెరుగుపర్చేందుకు క్యాంటిన్ పెట్టించాలని జనసేన తెలంగాణ రాష్ట్ర నేతలకు సూచించారు. నిరంజన్ పరామర్శ పూర్తయిన వెంటనే పవన్ వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయన వెంట జనసేన నేతలు శంకర్ గౌడ్, శ్రీరామ్ తాళ్లూరి, రాధారం రాజలింగం, ఆర్ కె సాగర్ తదితరులు ఉన్నారు.

## నమిలె గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పురోగతిని పరిశీలించిన హౌజింగ్ పిడి

రాజాపేట మండలంలోని నమిలె గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని హౌసింగ్ పీడీ లక్క అలివేలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను సందర్శించి పనుల నాణ్యత, నిర్మాణ వేగం, లబ్ధిదారులకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడిన హౌసింగ్ పీడీ, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి అర్హులైన నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయడమే లక్ష్యమని తెలిపారు. ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులు త్వరగా గృహ ప్రవేశం చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామంలో చేపడుతున్న పనులపై స్థానిక ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్న ఆమె, నిర్మాణాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. నిర్మాణ సామగ్రి నాణ్యత విషయంలో రాజీ పడకుండా అన్ని పనులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పులి రాజు, ఉప సర్పంచ్ మార్క శివకుమార్, గ్రామ నాయకులు మాయకోటి రాజు, బొమ్మగాని శ్రీను, మార్కెట్ డైరెక్టర్ సీలేవేరు బాలరాజు, హౌసింగ్ ఏఈ వేముల వివేక్, పంచాయతీ కార్యదర్శి ఎండీ జెమిల్ పాల్గొన్నారు.

## సర్‌తో ముస్లిం ఓట్ల తొలగింపు కుట్ర

మొదటి పేజీ తరువాయి
తెలంగాణలోనూ అలాంటి కుట్రలకు పాల్పడే ఛాన్స్ ఉందని ఆరోపించారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మంత్రి అజారుద్దీన్ మాట్లాడారు. 'సర్' అంశంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరి ఓటుని వాళ్లే కాపాడుకునే బాధ్యత తీసుకోవాలని సూచించారు. 'సర్'లో తొలగించే ఓట్లతో గెలుపు, ఓటములు ఆధారపడి ఉంటాయని పేర్కొన్నారు. తాను ఎప్పుడూ మాట్లాడినా.. నిజాయితీగా మాట్లాడుతానని మంత్రి అజారుద్దీన్ తెలిపారు. తనకు తెలుగు రాయడం, చదవడం వచ్చు అని వివరించారు. తెలుగులో మాట్లాడటం మాత్రం కొంత ఇబ్బందిగా ఉంటుందని అన్నారు. చిన్నప్పుడు తెలుగులో రాయడం, చదవడం ప్రాక్టీస్ చేసేవాడినని తెలిపారు. తెలుగులో మాట్లాడితే తప్పులు పోతే కొంత ఇబ్బందిగా ఉంటుందని చెప్పారు. తనకు సులువుగా ఉండే భాషలోనే తాను మాట్లాడుతానని అన్నారు. తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అనవసరపు విమర్శలు చేస్తూనే ఉంటాయని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో అద్భుతమైన పాలన అందిస్తున్నామని వ్యాఖ్యానించారు.
విద్యారంగంపై సీఎం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని మంత్రి ఉద్ఘాటించారు. కేసీఆర్ హయాంలో పెండింగ్‌లో పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ని తమ ప్రభుత్వం చెల్లిస్తోందని స్పష్టం చేశారు. తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చాలామంది పేదలకు సాయపడ్డానని.. పలు సమస్యలు పరిష్కరించానని తెలిపారు. తనకు పబ్లిసిటీపై మోజు లేదని అన్నారు. 200 మందికి పైగా ఆయా సమస్యలు పరిష్కరించాలని తనకు దరఖాస్తులు ఇచ్చారని తెలిపారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించానని మంత్రి అజారుద్దీన్ పేర్కొన్నారు.




# కోరుట్ల నియోజకవర్గ వార్తలు టూకీగా

- జగిత్యాల జిల్లాలోని కోరుట్ల నియోజకవర్గంలో ఈ వారంలో జరిగిన ప్రధాన పరిణామాల వార్తలు

**గాజెంగి మహేశ్వర్,కరపత్రం ప్రతినిధి**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా సంవత్సరం ప్రారంభం.నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో కొత్త విద్యా సంవత్సరం (2026-27) వేడుకగా ప్రారంభమైంది.పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు.

**రాజకీయాలు మరియు సంక్షేమం.**

- **స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ నియోజకవర్గ ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉంటూ పార్టీ కార్యాలయానికి వచ్చే ఆత్మీయులకు, పేదలకు వైద్య సహాయం మరియు ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.**
- **కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పర్యటనలు చేస్తున్నారు. ఇటీవల అగ్నిప్రమాదంలో తీవ్ర నష్టాన్ని ఎదుర్కొన్న కల్లుగీత కార్మికుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బాధితులకు మూడు బోర్లు మంజూరు చేయించారు.**

నియోజకవర్గంలోని రైతులు వ్యవసాయ పనులు, వానాకాలం పంటల సన్నాహాలు ముమ్మరంగా మొదలుపెట్టారు

## ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- డిఎంహెచ్ ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్




**కరపత్రం ప్రతినిది హైదరాబాద్,జూన్ 17**

ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం అంబర్ పేట క్లస్టర్ పరిధిలోని బాగ్ అంబర్ పేట, ముషీరాబాద్, బోలక్ పూర్, అంధ్రమహిళ సభ, హరాజ్ పెంట, తిలక్ నగర్ యుపిహెచ్ సీ లకు చెందిన వైద్యాధికారులు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ప్రాంగణంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ ఓ మాట్లాడుతూ... ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అందించడం ప్రతి ఆరోగ్య సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రజారోగ్య కార్యాక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, గర్భిణీల సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గునియా పై ఇంటింటి ఆరోగ్య సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే ఆరోగ్య సేవల పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించి, ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అనిత, డాక్టర్ శ్రీకళ, డాక్టర్ ఆశ్రిత రెడ్డి, డాక్టర్ మనోజ్ రెడ్డి, డాక్టర్ వంశిప్రియా, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా ఇందిరమ్మ ఇల్లు..

» ఇందిరమ్మ గృహప్రవేశం చేపించిన 29వ కౌన్సిలర్ బోరగాల మొగిలి



**కరపత్రం ప్రతినిది బ్యూరో, జూన్ 17**

నిరుపేదలకు అండగా ఇందిరమ్మ ఇల్లు నిలుస్తుందని, రేవంత్ ప్రభుత్వం లక్షలాదిమంది నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చడం జరుగుతుందని హుజురాబాద్ మునిసిపల్ 29వ వార్డ్ కౌన్సిలర్ బొరగాల మొగిలి-లక్ష్మి పేర్కొన్నారు. ఈరోజు 29వ వార్డులో పర్లపెల్లి సుమలత- సదానందంల నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కౌన్సిలర్ దంపతులు పాల్గొని లబ్ధిదారులను నూతన వస్త్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మొగిలి మాట్లాడుతూ ప్రతి మనిషికి కూడు గూడు గుడ్డ అవసరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రహించి అందులో అతి ముఖ్యమైన గూడును(ఇంటిని) ప్రతి ఒక్కరి సొంతింటి కలను నిజం చేస్తూ ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు. పేద ప్రజలు ఇందిరమ్మ ఇళ్లన సద్వినియోగం చేసుకొని ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ లత, మహిళా కాంగ్రెస్ నాయకురాలు మొలుగు రాధ, యూత్ కాంగ్రెస్ నాయకులు రేణికుంట్ల సందీప్, చిట్యాల రేవంత్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## వరంగల్ నగర అభివృద్ధి పనులపై కలెక్టర్ సత్య శారద సమీక్ష

» ఉర్సు రంగలీల మైదానం అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్ సత్య శారద

**కరపత్రం ప్రతినిది వరంగల్, జూన్ 17**

వరంగల్ నగర అభివృద్ధిలో భాగంగా ఖిలా వరంగల్ మోటు ప్రాంతం, కరీమాబాద్‌లోని ఉర్సు రంగలీల మైదానంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ డా.సత్య శారద మంగళవారం పరిశీలించారు.జీడబ్ల్యూఎంసీ చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి,సంబంధిత శాఖల అధికారులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండటంతో పాటు నిర్ణీత గడువులోగా పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించే లక్ష్యంతో ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.నగర సుందరీకరణతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణికి ఎయిమ్స్ తరహా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అవసరం





- కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేస్తాం
- కార్మికులను ఇబ్బంది పెట్టే రిఫరల్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి
- సింగరేణి వైద్య సిబ్బంది సేవలు అభినందనీయం: కవిత
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

**కరపత్రం ప్రతినిది బ్యూరో, జూన్ 17**

సింగరేణి ఏరియా ఆస్పత్రిని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అలాగే వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందితో సమావేశమై ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు, సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ చీఫ్ కవిత మాట్లాడుతూ.. సింగరేణి కార్మికులకు అత్యున్నత స్థాయి వైద్య సేవలు అందాల్సిన అవసరం ఉందన్నారు. గాంధీ, ఉస్మానియా వంటి ప్రముఖ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న సౌకర్యాలు సింగరేణి ఆస్పత్రుల్లో కూడా ఉండాలని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం సింగరేణి ఆస్పత్రులు అనేక సమస్యలతో సతమతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను అన్యాయంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తెలంగాణ రక్షణ సేన విధానం ప్రకారం రాష్ట్రంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానాలకు తావు ఉండకూడదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో తమకు అవకాశం వచ్చినప్పుడు ఈ విధానాలను పూర్తిగా రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలను కూడా తక్షణమే సవరించాల్సిన అవసరం ఉందన్నారు. నర్సింగ్ సిబ్బంది ప్రమోషన్లు, ఉద్యోగ భద్రత, సిబ్బంది కొరత వంటి అంశాలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. మరోవైపు కార్మికులను ప్రైవేట్ రిఫరల్ ఆస్పత్రులకు పంపుతున్నప్పటికీ అక్కడ సరైన వైద్య సేవలు అందడం లేదని విమర్శించారు. నిమ్స్ ధరలకే చికిత్స అందిస్తామని చెప్పి, అత్యవసర పరిస్థితుల్లో రోగులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్న ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్మికులు, వారి కుటుంబాలు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండాలంటే సింగరేణిలో ఎయిమ్స్ తరహా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతవరకు రిఫరల్ ఆస్పత్రులు కార్మికులను ఇబ్బందులకు గురి చేయకుండా సింగరేణి యాజమాన్యం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తామని, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు కోసం తెలంగాణ రక్షణ సేన తరఫున అన్ని విధాలా కృషి చేస్తామని కవిత స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం పరిమిత వనరులు, తక్కువ సౌకర్యాల మధ్య కూడా ప్రభుత్వ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలు అందిస్తున్న సింగరేణి వైద్యులు, నర్సులు, సిబ్బంది అంకితభావం అభినందనీయమని కొనియాడారు. వారి సేవలకు గౌరవ సూచకంగా చేతులెత్తి నమస్కరిస్తున్నానని పేర్కొన్నారు. కార్మిక సంక్షేమం, నాణ్యమైన వైద్య సేవలు, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై తెలంగాణ రక్షణ సేన పోరాటం మరింత బలోపేతం అవుతుందని ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత తెలిపారు.

# గోదావరిఖని 11 ఇంక్లైన్‌లో కవిత 'బాయిబాట'..



- కార్మిక సమస్యలపై ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు




**కరపత్రం ప్రతినిది బ్యూరో, జూన్ 17**

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత చేపట్టిన "బాయిబాట" కార్యక్రమం గోదావరిఖని 11 ఇంక్లైన్ వద్ద ఉద్రిక్త వాతావరణంలో సాగింది. సింగరేణి కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించిన ఆమె, కార్మికుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కార్మికులను కలిసేందుకు వచ్చిన తమను గేట్లు మూసివేసి అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని కవిత మండిపడ్డారు. సింగరేణి కార్మికులకు ఏ రాజకీయ పార్టీ నాయకులతో నైనా మాట్లాడే హక్కు ఉందని, కానీ యాజమాన్యం పోలీసులను రంగంలోకి దించి కార్మికులను, ప్రతిపక్షాలను దూరం పెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. సింగరేణిలో కార్మికులకు కనీస భద్రతా ప్రమాణాలు కూడా అందడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గనుల్లో పనిచేసే కార్మికులకు నాణ్యమైన గ్లౌజులు, షూస్, అవసరమైన యంత్రాలు, తగిన ఆక్సిజన్ వంటి ప్రాథమిక సౌకర్యాలు కూడా అందుబాటులో లేవని విమర్శించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం గత ప్రభుత్వంపై నెపం నెట్టడం సరైన విధానం కాదన్నారు. తెలంగాణ ఉద్యమం నుంచి సింగరేణి కార్మికులతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని పేర్కొన్న కవిత, డిపెండెంట్ ఉద్యోగాల కోసం తాను చేసిన పోరాటం ఫలితంగానే వేలాది ఉద్యోగాలు కల్పించబడ్డాయని గుర్తుచేశారు. మహిళలకు కూడా సింగరేణిలో ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా గతంలో చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్మికుల హక్కులను పరిరక్షించేందుకు యూనియన్లు అవసరమని, చిన్న చిన్న విషయాలకు మెమోలు జారీ చేస్తూ కార్మికులను వేధించడం మానుకోవాలని అధికారులకు సూచించారు. కార్మికుల సంక్షేమం కోసం అధికారులు కూడా మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ప్రస్తావించిన కవిత, రాష్ట్ర గౌరవాన్ని దెబ్బతీసేలా ఆయన మాట్లాడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి బలహీనతను ప్రదర్శించే వ్యాఖ్యలు చేయడం వల్ల ఇతర రాష్ట్రాల నాయకులు తెలంగాణపై పెత్తనం చెలాయించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

సింగరేణి భవిష్యత్తుపై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కొత్త బొగ్గు బ్లాకులను కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వం అండర్‌గ్రౌండ్ మైనింగ్‌ను ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. ఓపెన్ కాస్ట్ గనుల కంటే అండర్‌గ్రౌండ్ మైనింగ్ వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.

సింగరేణి నిధులతో నిర్మించిన మెడికల్ కాలేజీల్లో కార్మికుల పిల్లలకు తగిన రిజర్వేషన్ కల్పించాలని, కార్మిక కుటుంబాల విద్యాభివృద్ధికి నాణ్యమైన విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిని కాపాడటం తమ ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేసిన కవిత, కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమను సంప్రదించాలని, వారి హక్కుల కోసం ఎల్లప్పుడూ పోరాడుతామని హామీ ఇచ్చారు. "మీరు కష్టాల్లో ఉన్నప్పుడు మేము మీతో ఉంటాం.. మీరు మా వెంటే ఉంటే సింగరేణి హక్కుల సాధన కోసం మరింత బలంగా పోరాడగలుగుతాం" అని కార్మికులకు పిలుపునిచ్చారు.

# కిడ్స్ ప్రీ స్కూల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని, కె ఆర్ నాగరాజు





- చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలి: ఎమ్మెల్యేలు నాయిని, కేఆర్ నాగరాజు

**కరపత్రం ప్రతినిది బ్యూరో, జూన్ 17**

నాణ్యమైన ప్రాథమిక విద్య ద్వారానే చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. బుధవారం హన్మకొండ జిల్లా హంటర్ రోడ్డులో నేషనల్ మార్ట్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన కిడ్స్ ప్రీ స్కూల్ ను వారు సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.

ప్రారంభోత్సవం సందర్భంగా స్కూల్ నిర్వాహకులు ఎమ్మెల్యేలను పుష్పగుచ్ఛాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు విద్యాసంస్థలోని తరగతి గదులు, చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన విద్యా సామగ్రి, ఆటవస్తువులు, భద్రతా ప్రమాణాలు, మౌలిక వసతులను పరిశీలించి అభినందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, ప్రీ-స్కూల్ దశ పిల్లల వ్యక్తిత్వ వికాసంలో అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. చిన్నారులలో సృజనాత్మకత, క్రమశిక్షణ, సామాజిక అవగాహన పెంపొందించే విధంగా విద్యాబోధన జరగాలని సూచించారు. ఆధునిక విద్యా విధానాలతో పాటు విలువలతో కూడిన బోధన అందించడం ద్వారా భావితరాలను తీర్చిదిద్దే బాధ్యత విద్యాసంస్థలపై ఉందన్నారు.

పిల్లల మానసిక, శారీరక అభివృద్ధికి అనుకూలమైన వాతావరణం కల్పిస్తూ, విద్యను ఆనందదాయకంగా మార్చే ప్రయత్నాలు ప్రతి విద్యాసంస్థ చేపట్టాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల విశ్వాసాన్ని నిలబెట్టేలా నాణ్యమైన విద్యా సేవలు అందించాలని స్కూల్ యాజమాన్యానికి సూచించారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, తల్లిదండ్రులు, స్థానిక నాయకులు, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కలిసిన ఎర్రబెల్లి వినీత్ రావు



**కరపత్రం ప్రతినిది వరంగల్, జూన్ 17**

వరంగల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వరంగల్ పర్యటనలో భాగంగా.., బుధవారం నగరానికి విచ్చేసిన సందర్భంగా, ఎర్రబెల్లి ప్రదీప్ రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వినీత్ రావు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఇరువురూ కొద్దిసేపు పరస్పరం మాట్లాడుకుని పలు సామాజిక,ప్రజా సంక్షేమ అంశాలపై చర్చించినట్లు తెలిసింది.వరంగల్ పర్యటన సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు పవన్ కళ్యాణ్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక

గురువారం జూన్ 18, 2026

## దివ్యాంగుల సమస్యపై స్పందించిన చైర్మన్ పుల్కం రాజు



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మానవీయ దృశ్యం చోటుచేసుకుంది. వికలాంగుల రుణాల కోసం వచ్చిన ఇద్దరు దివ్యాంగులు నడవలేని పరిస్థితిలో కార్యాలయం బయటే ఉండటాన్ని గమనించిన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు స్వయంగా వారి వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. జీవనోపాధి కోసం రుణాలు అవసరమని వారు వివరించగా, అర్హులైన వారికి ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తమ వద్దకే వచ్చి పరామర్శించి భరోసా కల్పించిన చైర్మన్‌కు దివ్యాంగులు కృతజ్ఞతలు తెలిపారు.

## 11వ వార్డులో సమస్యలపై చైర్మన్ ప్రత్యేక దృష్టి




**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు బుధవారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు 11వ వార్డులో పర్యటించి తాగునీటి, రహదారుల సమస్యలను పరిశీలించారు. మూలనపడ్డ వాటర్ ప్లాంట్‌ను త్వరలో పునరుద్ధరిస్తామని, సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేగంగా ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా పాలన వార్డు సభలో వచ్చిన సమస్యలపై చైర్మన్ స్పందించినందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వార్డు కౌన్సిలర్ వెంగళ అనిత–శ్రీకాంత్, కో ఆప్షన్ సభ్యులు పీర్ మోహమ్మద్, మున్సిపల్ ఏఈ అనన్య తదితరులున్నారు.

## కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు జయప్రదం చేయండి



– జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్

**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో కల్లు గీత కార్మిక సంఘం బుధవారం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను జూన్ 22, 23 తేదీలలో హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు. ఈ యొక్క శిక్షణ తరగతులలో, కల్లుగీత వృత్తి పుట్టుక, ఉద్యమ చరిత్ర, కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘాల ఏర్పాటు, సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర, ఇతర రాష్ట్రాలలో కల్లుగీత వృత్తి ఎలా ఉంది. మన రాష్ట్రంలో ఉన్న పరిస్థితి ప్రభుత్వ విధానాలు. ఎక్సైజ్ శాఖ,బీసీకార్పొరేషన్ శాఖ, మనకు ఏవిధంగా పనిచేస్తున్నాయి. ఈత, తాటి చెట్ల పెంపకాలు. కల్లుగీత వృత్తిరక్షణకు ప్రభుత్వం తీసుకోవలసిన చర్యలు, సంఘనిర్మాణం.ఇలా అనేక అంశాలపై కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ యొక్క శిక్షణ తరగతులలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ తరపున ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. రమేష్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు రామా గౌడ్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ యాదగౌడ్, సంగారెడ్డి అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా నాయకులు ప్రవీణ్ గౌడ్, కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా నాసా కాంటెస్ట్ లో సత్తా చాటిన మల్లెల సాయి శభరిష్ రెడ్డి

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 17:**




అమెరికాలో జరిగిన స్పేస్ సెటిల్మెంట్ కాన్ఫరెన్స్ లో శ్రీ చైతన్య హైస్కూల్ ఎన్.టి.పి.సి, రామగుండం ఆరవ తరగతి విద్యార్థి, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మల్లెల నాగిరెడ్డి, మల్లెల శివపార్వతి (హోటల్ శుభం రేజెన్సీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్) కుమారుడు "మల్లెల సాయి శభరిష్ రెడ్డి" పాల్గొని తన యొక్క స్పేస్ ప్రాజెక్టుని అమెరికా స్పేస్ శాస్త్రవేత్తలకు వివరించాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తమ యొక్క సైన్స్ సృజనాత్మకతను వివరించడానికి శ్రీ చైతన్య స్కూల్ నిర్వహించే నాసా ప్రోగ్రాం చాలా అనువైనదని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీన్ రమేష్, నాస ఇంచార్జ్ రమేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నరేంద్ర కుమార్ మరియు అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు అందరూ పాల్గొని మల్లెల సాయి శభరిష్ రెడ్డిని అభినందించారు.

## 120 రోజుల నిరంతర పోరాటం ఫలించింది.. 11వ వార్డులో డ్రైనేజీల శుభ్రతకు జేసీబీ ఏర్పాటు

- మున్సిపల్ చైర్మన్ స్పందనపై కౌన్సిలర్ పొనగంటి విష్ణువర్ధన్ కృతజ్ఞతలు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూన్ 17:**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని 11వ వార్డులో నెలల తరబడి కొనసాగుతున్న డ్రైనేజీ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం దొరికింది. గత 120 రోజులుగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో నిరంతరం ప్రస్తావిస్తూ, ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన 11వ వార్డు కౌన్సిలర్ పొనగంటి విష్ణువర్ధన్ కృషి ఫలించింది. మున్సిపల్ చైర్మన్ స్పందనతో బుధవారం జేసీబీ సహాయంతో డ్రైనేజీల శుభ్రపరిచే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పొనగంటి విష్ణువర్ధన్ మాట్లాడుతూ, తమ వార్డులోని పలు కాలనీల్లో డ్రైనేజీలు పూర్తిగా మురుగు, చెత్తతో నిండిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి చేరి ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగిస్తోందని పేర్కొన్నారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన మురుగు




కారణంగా దుర్వాసనలు వ్యాపించడం, దోమల సమస్య పెరగడం, ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నందున వెంటనే శుభ్రత చర్యలు చేపట్టాలని గత నాలుగు నెలలుగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో పదేపదే కోరినట్లు వెల్లడించారు. గత 120 రోజులుగా జరిగిన ప్రతి మున్సిపల్ సమావేశంలో జేసీబీ ఏర్పాటు చేసి డ్రైనేజీలను శుభ్రం చేయాలని కోరినప్పటికీ తగిన స్పందన రాకపోవడం బాధాకరమన్నారు. పలుమార్లు అధికారులను, ప్రజాప్రతి




నిధులను కలిసి సమస్య తీవ్రతను వివరించినప్పటికీ కొంత జాప్యం జరిగిందని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 16వ తేదీన మున్సిపల్ చైర్మన్‌ను నేరుగా కలిసి, గత మూడు నెలలుగా జేసీబీ కోరుతున్నప్పటికీ స్పందన లేదని, తక్షణమే డ్రైనేజీ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేసినట్లు కౌన్సిలర్ తెలిపారు. దీనిపై మున్సిపల్ చైర్మన్ సానుకూలంగా స్పందించి బుధవారం జేసీబీని పంపించడంతో డ్రైనేజీల శుభ్రపరిచే పనులు ప్రారంభమైనట్లు చెప్పారు. జేసీబీ సహాయంతో వార్డులోని ప్రధాన డ్రైనేజీలలో పేరుకుపోయిన మురుగు, చెత్తను తొలగించడంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారని తెలిపారు. శుభ్రత పనులు పూర్తికావడంతో వర్షపు నీటి ప్రవాహం సాఫీగా సాగేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి స్పందించి జేసీబీ ఏర్పాటు చేసిన



మున్సిపల్ చైర్మన్‌కు కౌన్సిలర్ పొనగంటి విష్ణువర్ధన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాజకీయాలకు అతీతంగా అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. స్థానిక ప్రజలు కూడా డ్రైనేజీల్లో చెత్త వేయకుండా పరిశుభ్రత పాటించాలని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. భవిష్యత్తులో కూడా వార్డు అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని కౌన్సిలర్ పొనగంటి విష్ణువర్ధన్ స్పష్టం చేశారు. 11వ వార్డులో చేపట్టిన ఈ డ్రైనేజీ శుభ్రత కార్యక్రమంతో స్థానికుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. చాలా కాలంగా వేధిస్తున్న సమస్యకు పరిష్కారం లభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ మున్సిపల్ యంత్రాంగానికి, కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## మెడికవర్‌లో అత్యాధునిక మినిమల్లీ ఇన్వాసివ్ గుండె శస్త్రచికిత్స.

కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ రవికుమార్

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ జూన్ 18**

మెట్రో నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండే అత్యాధునిక మినిమల్లీ ఇన్వాసివ్ కార్డియోవాస్క్యులర్ సర్జరీని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్య బృందం విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ రవికుమార్ వెల్లడించారు. బుధవారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా ఛాతినొప్పి, తీవ్రమైన ఆయాసం, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న జగిత్యాలకు చెందిన 54 ఏళ్ల మాధవి చికిత్స కోసం మెడికవర్ ఆసుపత్రికి రాగా, వైద్య పరీక్షల్లో ఆమె గుండెలోని ప్రధాన మైట్రల్ వాల్వ్ మూసుకుపోయినట్లు గుర్తించామన్నారు. సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో ఓపెన్ హార్ట్ సర్జరీ నిర్వహిస్తారని, అయితే ఆ పద్ధతిలో రోగి కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుందని వివరించారు. రోగి ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఛాతి కింది భాగంలో చిన్న గాటు ద్వారా మినిమల్లీ ఇన్వాసివ్ పద్ధతిలో మైట్రల్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని రోగి కుటుంబ సభ్యులకు వివరించగా వారు అంగీకరించడంతో శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. మినిమల్లీ ఇన్వాసివ్ కార్డియాక్ సర్జరీ వల్ల నొప్పి, రక్తస్రావం, ఇన్ఫెక్షన్ల ప్రమాదం



తగ్గడమే కాకుండా, రోగి వేగంగా కోలుకుంటుందని వివరించారు. ప్రస్తుతం మాధవి పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. అత్యాధునిక వైద్యసేవలను సైతం ఆరోగ్యశ్రీ పరిధిలో అందించి, కొత్త జీవితం ప్రసాదించిన మెడికవర్ వైద్య బృందానికి రోగి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ విలేకరుల సమావేశంలో కార్డియాలజిస్టులు డాక్టర్ అనీష్ పబ్బ, డాక్టర్ వాసుదేవరెడ్డి, అనెస్థీషియా డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల ప్రాణాల విషయంలో రాజీ లేదు: ఎంవీఐ వంశీధర్

స్కూల్ వ్యాన్ల ఫిట్‌నెస్‌పై ప్రత్యేక డ్రైవ్ స్వయంగా వ్యాన్లు నడిపి ఫిట్‌నెస్ పరీక్షించిన ఎంవీఐ

**కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల**

పిల్లల ప్రాణాల విషయంలో రాజీ ప్రసక్తే లేదని రాజన్న సిరిసిల్ల జిల్లా మోటార్ వాహన తనిఖీ అధికారి (ఎంవీఐ) వంశీధర్ స్పష్టం చేశారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ బుధవారం వేములవాడ పట్టణంలోని పలు పాఠశాలలకు చెందిన స్కూల్ వ్యాన్లపై ప్రత్యేక ఫిట్‌నెస్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ వంశీధర్ స్వయంగా కొన్ని స్కూల్ వ్యాన్లను నడిపి వాటి ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. వాహనాల బ్రేకులు, స్టీరింగ్, టైర్లు, సీటింగ్ సామర్థ్యం, అత్యవసర భద్రతా సౌకర్యాలు, అగ్నిమాపక పరికరాలు, ప్రథమ చికిత్స కిట్లు తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో ఫిట్‌నెస్ ప్రమాణాలు పాటించని కొన్ని వాహనాలను గుర్తించి సంబంధిత యాజమాన్యాలకు హెచ్చరికలు జారీ చేశారు. అలాగే నిర్దేశిత యూనిఫామ్‌లో లేని డ్రైవర్లను మందలించి, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ వాహనాలను స్వయంగా నడిపి పరిశీలించడం ద్వారా వాటి వాస్తవ పరిస్థితి, భద్రతా ప్రమాణాలు, లోపాలను సులభంగా గుర్తించవచ్చని



తెలిపారు. విద్యార్థుల భద్రతకు భంగం కలిగించే విధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కూల్ యాజమాన్యాలు, డ్రైవర్లు రవాణా శాఖ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. ఎంవీఐ స్వయంగా వాహనాలను నడిపి తనిఖీలు నిర్వహించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. పిల్లల భద్రత దృష్ట్యా ఇటువంటి ప్రత్యేక తనిఖీలు తరచూ నిర్వహించాలని కోరారు. విద్యార్థుల సురక్షిత ప్రయాణం కోసం భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

## కోర్కల్‌లో ఇసుక రీచ్ ప్రారంభం.. దశాబ్దాల కల సాకారం: వొడితల ప్రణవ్


**కరపత్రం ప్రతినిధి వీణవంక, జూన్ 17:**

వీణవంక మండలం కోర్కల్ గ్రామంలోని మానేరు పరివాహక ప్రాంతంలో ఇసుక రీచ్‌ను హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ బుధవారం ఘనంగా ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ ఇసుక రీచ్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రాంత ప్రజలు భారీ సంఖ్యలో హాజరై ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వొడితల ప్రణవ్ మాట్లాడుతూ కోర్కల్ ప్రాంత ప్రజల దశాబ్దాల నాటి కల నేడు నెరవేరిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి, ఉపాధి కల్పన దిశగా అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. ఇసుక రీచ్ ప్రారంభంతో స్థానిక యువతకు స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఇసుక అందుబాటులోకి వస్తుందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇసుక వ్యవహారంలో పారదర్శకత లోపించిందని ఆరోపించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యాప్ ఆధారిత విధానాల ద్వారా పారదర్శకంగా ఇసుక సరఫరా చేపడుతోందన్నారు. గతంలో ఇసుక ద్వారా సంవత్సరానికి రూ.400 కోట్ల మేర ఆదాయం వచ్చేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం



ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ సుమారు రూ.1100 కోట్లకు పైగా ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకు సమకూరుస్తోందని వెల్లడించారు. ఇసుక సంపదను కొందరి చేతుల్లో కేంద్రీకరించకుండా ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, సంపద సృష్టించి పేదలకు పంచే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యమని, ఈ నిర్ణయంతో అది మరోసారి రుజువైందన్నారు. అంతకుముందు కోర్కల్ గ్రామంలోని ప్రసిద్ధ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో వొడితల ప్రణవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ ప్రజలు "జై కాంగ్రెస్ -- జై ప్రణవ్" నినాదాలతో సభా ప్రాంగణాన్ని మార్మోగించారు. ప్రజలు ప్రభుత్వం సూచించిన యాప్ విధానాలను అనుసరించి





ఇసుకను సక్రమంగా పొందాలని, అక్రమ రవాణాకు ఆస్కారం లేకుండా అందరూ సహకరించాలని వొడితల ప్రణవ్ కోరారు. ఈ కార్యక్రమంలో కోర్కల్ గ్రామ సర్పంచ్, ఇసుక రీచ్ అధికారులు, వీణవంక మండల కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.